క్లుప్తంగా

వైఎస్ షర్మిలను అరెస్టు చేయడం సరికాదు



బోధన్: ప్రజల పక్షాన నిలిచి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిలను అరెస్టు చేసి జైలులో నిర్బంధించడం సరికాదని, వెంటనే విడుదల చేయాలని వైఎస్ ఆర్‌టీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు పట్టణంలో మంగళవారం వారు అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి, నిరసన తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు జగన్‌గౌడ్, నాయకులు సంగమేశ్వర్, అశోక్, పోచన్న, స్వప్న, మరియమ్మ, ప్రభాకర్, సైదమ్మ పాల్గొన్నారు.

ముస్లింల రిజర్వేషన్లు తీసేస్తామనడం సరికాదు



బోధన్‌టౌన్(బోధన్): బీజేపీ అధికారంలోకి వస్తే ముస్లింలకు రిజర్వేషన్ తొలగిస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అనడం సరికాదని కాంగ్రెస్ నాయకులు అన్నారు. పట్టణంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ నేతలు విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రిజర్వేషన్‌లు తొలగించదని, బీఆర్‌ఎస్, బీజేపీలు రెండు ఒక్కటే అని మైనార్టీలు ఇప్పటికైనా ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. నాయకులు వహీద్, అమీన్, అలీ తదితరులు ఉన్నారు.

లబ్ధిదారులకు దుకాణాలను కేటాయించాలి



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని అంగడి బజార్‌లో 2022లో ప్రారంభించిన రైతు బజార్ దుకాణాలను లబ్ధిదారులకు త్వరగా కేటాయించాలని కాంగ్రెస్ నాయకుడు కోలా వెంకటేష్ డిమాండ్ చేశారు. రైతు బజార్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు బజార్ దుకాణాలు ఇప్పటి వరకు ఎవరికీ కేటాయించకపోవడంతో నిరుపయోగంగా మారాయన్నారు. ఈనెల 27లోపు దుకాణాలను లబ్ధిదారులకు కేటాయించాలన్నారు. లేదంటే 28న రైతు బజార్‌ను ప్రారంభించి, దుకాణాలను కేటాయిస్తామని హెచ్చరించారు. అలా శిథిలావస్థకు చేరుకుంటున్న ఇండోర్ స్టేడియంను సైతం ప్రారంభించనున్నట్లు తెలిపారు. నాయకులు మీర్ మాజీద్ అలీ, మందుల పోశెట్టి, హబీబ్, రవి పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనాలి



మాక్లూర్: తడిసిన ధాన్యంతో పాటు, కల్లాలపై ఉన్న ధాన్యాన్ని కాంటాలు పెట్టి రైస్ మిల్లులకు తరలించాలని అఖిల భారత రైతు కూలి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డు గంగాధర్ డిమాండ్ చేశారు. మండలంలోని మదన్‌పల్లి గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాల వల్ల రైతులు ధాన్యాన్ని తడవకుండా కాపాడుకోవటానికి పడరాని పాట్లు పడుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి రైతులకు న్యాయం చేయాలన్నారు. నాయకులు నర్సయ్య, దేవిదాస్, భూమన్న, లక్ష్మన్‌లు ఉన్నారు.

పంట నష్టం పరిశీలన



బాల్కొండ: ముప్కాల్ మండలం నాగంపేట్, వెంచిర్యాల్, రెంజర్లలో సోమవారం కురిసిన అకాల వర్షం వల్ల దెబ్బతిన్న పంటను మంగళవారం వ్యవసాయ అధికారి రాజుకుమార్ పరిశీలించారు. 310 ఎకరాల్లో వరి పంట నష్టం వాటిల్లిందన్నారు. ఉన్నత అధికారులకు నివేదిక అందజేస్తామన్నారు.

విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ

బాల్కొండ: ముప్కాల్ మండలం నాగంపేట్ గ్రామంలో సోమవారం గాలివానా భీభత్సతో ఐదు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. మంగళవారం ట్రాన్స్‌కో అధికారులు స్తంభాలను పునరుద్ధరించారు.బుధవారం పూర్తిస్థాయిలో పనులు పూర్తిచేస్తామని అధికారులు తెలిపారు.

బాద్గుణ రోడ్డు బాగుపడేదెప్పుడు?

- రెండేళ్ల క్రితమే నిధులు విడుదల
- ఇప్పటికీ ప్రారంభంకాని పనులు
- పట్టించుకోని అధికారులు



ఉమ్మెడ-బాద్గుణ గ్రామాల మధ్య గుంతలమయంగా మారిన రోడ్డు

నందిపేట్(ఆర్మూర్): మండలంలోని బాద్గుణ గ్రామం మీదుగా వెళ్లే రోడ్డు గుంతలు తేలి అధ్వానంగా మారింది. దీంతో మరమ్మతుల కోసం ప్రభుత్వం స్పందించి రెండేళ్ల క్రితమే నిధులు విడుదల చేసింది. కానీ ఇప్పటికీ పనులు ప్రారంభం కాకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డును బాగు చేస్తే మండలంలోని బజార్‌కొత్తూర్, ఉమ్మెడ, మాయాపూర్, బాద్గుణ, సీహెచ్ కొండూర్ గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పనున్నాయి.

మరమ్మతులకు రూ.45.80లక్షలు..

నందిపేటలోని చాకలి ఐలమ్మ విగ్రహం నుంచి బాద్గుణ, సీహెచ్ కొండూర్ గ్రామాల వరకు వెళ్లే రోడ్డు అధ్వానంగా మారడంతో, మరమ్మతులకు ప్రభుత్వం రూ. 45.80 లక్షలు మంజూరు చేసింది. నిధులు మంజూరై ఇప్పటికీ రెండు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ అధికారులు కనీసం టెండర్లు పిలవకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై పెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గోదావరి పరివాహక ప్రాంతమైన ఉమ్మెడ గోదావరి నదిపై వంతెన నిర్మాణంతో పాటు నందిపేట వరకు ప్రత్యేక రోడ్డును ఏర్పాటు చేస్తుండటంతో తమ గ్రామాల రోడ్డును పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా బజార్ కొత్తూర్ క్రాస్‌రోడ్డు నుంచి చౌడమ్మ కొండూర్ గ్రామం వరకు రెండు జిల్లాలను కలుపుతూ వేసిన వంతెన పైనుంచి తారురోడ్డు వేయడంతో రెండు కిలో మీటర్ల దూరం తగ్గింది. రోడ్డు పనులు చేపట్టకపోవడంతో నిధులు తిరిగి వెనక్కి వెళ్లిపోతే తమ పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. అధికారులు, నాయకులు ఇప్పటికైనా పట్టించుకుని రోడ్డు పనులు వెంటనే చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వెంటనే మరమ్మతులు చేపట్టాలి..



నందిపేట నుంచి బాద్గుణ వరకు రోడ్డు మరమ్మతుల కోసం నిధులు వచ్చి రెండేళ్లు అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారులు, నాయకులు పట్టించుకుని వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి. –లోకేందర్‌రెడ్డి, బాద్గుణ గ్రామం

కాంట్రాక్టర్లు రావడం లేదు..

నందిపేట నుంచి బాద్గుణ, చౌడమ్మ కొండూర్ గ్రామాల వరకు రోడ్డు మరమ్మతులకు నిధులు ఉన్నాయి. కానీ పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ఎవరు ముందుకు రావడం లేదు. ఈ విషయంలో ఉన్నతాధికారుల సూచనల మేరకు త్వరలో ఒక నిర్ణయం తీసుకుంటాం. –రఘు, ఏఈ, ఆర్‌అండ్‌బీ

చెవిలో పువ్వుతో వీవోఏల నిరసన





మాక్లూర్‌లో చెవిలో పువ్వులతో నిరసన తెలుపుతున్న వీవోఏలు.. మెండోరా మండల కేంద్రంలో..

తమ సమస్యల పరిష్కారం కోసం ఐకేపీ వీవోఏలు చేపట్టిన సమ్మె మంగళవారం రెండో రోజు కొనసాగింది. ఈసందర్భంగా ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లోని అన్ని మండలాలు, గ్రామాల్లో వీవోఏలు చెవిలో పువ్వులు పెట్టుకొని నిరసన తెలిపారు. పలువురు మాట్లాడుతూ.. తాము ఎంతో శ్రమిస్తున్నా కనీస వేతనం ఇవ్వడం లేదని వాపోయారు. రూ.18వేలు వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, బీమా సౌకర్యం కల్పించాలని కోరారు.

– మాక్లూర్ /రుద్రూర్/బాల్కొండ/భీమ్‌గల్/కమ్మర్‌పల్లి



కమ్మర్‌పల్లిలో..



భీమ్‌గల్‌లో..

అక్రమ నిర్మాణాల తొలగింపు

నవీపేట: మండలంలోని కమలాపూర్ గ్రామంలో ప్రభుత్వ స్థలంలో నిర్మించిన అక్రమ నిర్మాణాలను గ్రామస్తుల ఫిర్యాదు మేరకు మంగళవారం అధికారులు తొలగించారు. జీపీ పరిధిలో చేపట్టిన నిర్మాణాలను జేసీబీతో తొలగించారు. మరో అయిదు ప్రాంతాలలో నిర్మించిన నిర్మాణాలను తొలగించాలని యజమానులకు నోటీసులు జారీ చేశారు. గడువు ముగిశాక జేసీబీతో కూల్చేస్తామని హెచ్చరించారు. ఎంపీఓ రామకృష్ణ, ఎస్సై రాజారెడ్డి, జీపీ కార్యదర్శి ప్రమీల తదితరులు ఉన్నారు.

మలేరియా వ్యాధిపై అవగాహన ర్యాలీ



మోర్తాడ్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది..



కోటగిరి మండల కేంద్రంలో..



వేల్పూర్ మండల కేంద్రంలో..

రుద్రూర్/వేల్పూర్/ రెంజల్/నందిపేట్/మోర్తాడ్: కోటగిరి, రుద్రూర్, పొతంగల్, మోస్రా, చందూర్, మోర్తాడ్, రెంజల్, వేల్పూర్, నందిపేట్ మండలాల్లో మంగళవారం ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మలేరియా వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణపై అవగాహన కల్పించారు. మురికి నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకునాలని వివరించారు.

రాష్ట్రంలో మూడోసారి అధికారం బీఆర్‌ఎస్‌దే

- ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి
- ఘనంగా బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం



ఆర్మూర్‌లో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, పాల్గొన్న బీఆర్‌ఎస్ నేతలు

ఆర్మూర్/రుద్రూర్/రెంజల్/బోధన్‌టౌన్/వర్ని/వేల్పూర్/నవీపేట్/బాల్కొండ: రాష్ట్రంలో మూడోసారి ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ విజయం సాధించి, అధికారానికి కైవసం చేసుకుంటుందని ఆర్మూర్ ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ ఆశన్నగారి జీవన్‌రెడ్డి పేర్కొన్నా రు. ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో మంగళవారం బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అన్ని మండలాలు, గ్రామాల్లో పార్టీ మండల, గ్రామ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు ప్రజాప్రతినిధులు పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం స్వీట్లు, పండ్లు పంచుకొని సంబురాలు నిర్వహించారు. అలాగే ఆర్మూర్‌లో నియోజకవర్గ పార్టీ ప్రతినిధుల మహాసభ నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని, పార్టీ జెండాను ఆవిష్కరించి, తెలంగాణ తల్లి చిత్రపటానికి పూలమాల వేసి, అమర వీరుల స్థూపానికి నివాళి అర్పించి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతీ కార్యకర్త ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు చేస్తున్న విష ప్రచారాన్ని తిప్పి కొట్టాలన్నారు. జిల్లా ఇన్‌చార్జి బండ ప్రకాష్, రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేష్ రెడ్డి, జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థచైర్మన్ ఎల్‌ఎంబీ రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.





మోస్రాలో బీఆర్‌ఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు.. బోధన్ పట్టణంలో..



బాల్కొండలో

ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయొద్దు



ఆర్డీవో రాజేశ్వర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బోధన్: పేదల కడుపు నింపేందుకు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చెయ్యొద్దని కాంగ్రెస్ పార్టీ అనుబంధం కేకేసీ (కామ్‌గార్ కర్మచారి కాంగ్రెస్- అసంఘటిత కార్మికుల కాంగ్రెస్) నేషనల్ కో-ఆర్డినేటర్ కెప్టెన్ కరుణాకర్ రెడ్డి పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకంపై నిర్లక్ష్య వైఖరికి నిరసనగా మంగళవారం పట్టణంలో నియోజకవర్గ స్థాయి ధర్నా నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి, ఆర్డీవో రాజేశ్వర్‌కు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా కెప్టెన్ కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో నిరుద్యోగ యువతకు, గ్రామీణ ప్రాంత పేదలకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెంచాల్సిన కేంద్ర ప్రభుత్వం, ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడం సరికాదన్నారు. ఏటా 2కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మోదీ ప్రభుత్వం ఇచ్చిన హామీని తుంగలో తొక్కిందన్నారు. ఉపాధి కూలీలకు ఏటా 150రోజులు పని కల్పించాలని, దినసరి కూలీని పెంచాలని డిమాండ్ చేశారు. ఈ పథకాన్ని కాపాడుకునేందుకు పేదలంతా సంఘటితం కావాలన్నారు.జూన్‌లో బోధన్‌లో 50వేల మందితో ధర్నా, సభను నిర్వహిస్తామన్నారు. కేకేసీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్‌యాదవ్, జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రాజ్, కో-ఆర్డినేటర్ శంకర్ నాయుడు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బుద్దె సావిత్రి

బోధన్‌రూరల్(బోధన్): మండలంలోని గ్రామాల అభివృద్ధి, ప్రజా సంక్షేమ పథకాల అమలులో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ బుద్దె సావిత్రి అన్నారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండల అధికారులు బోధన్, సాలూర మండలాల్లో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలును వివరించారు. ఈసందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు గ్రామాల్లోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లగా సకాలంలో సమస్యలను పరిష్కరించాలని ఎంపీపీ ఆదేశించారు. వైస్ ఎంపీపీ కోట గంగారెడ్డి, జెడ్పీటీసీ లక్ష్మీ, ఎంపీడీవో పర్బన్న, ఏపీవో మధుకర్, మండల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

సమాచారం..

నేడు బీఆర్‌ఎస్ మినీ ప్లీనరీ

బోధన్: ఎడపల్లిలో బుధవారం ఉదయం పది గంటలకు నియోజకవర్గ బీఆర్‌ఎస్ మినీ ప్లీనరీ సమావేశం ఉంటుందని ఎమ్మెల్యే షకీల్ ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు కార్యక్రమానికి అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రైతులను ఆదుకోవాలి



బోధన్: అకాల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ నియోజకవర్గ నాయకుడు వడ్డె మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బోధన్‌లో మంగళవారం ఆయన స్థానిక నాయకులతో కలిసి మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని రకాల సౌకర్యాలు సమకూర్చాలని కోరారు. ప్రభుత్వం, రైస్‌మిల్లర్లు మానవతా దృక్పథంతో రైతులకు అండగా నిలవాలని పేర్కొన్నారు. పార్టీ జిల్లా ప్రతినిధి సుధాకర్‌చారి, పోశెట్టి, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి



అంకాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్క్‌ఫెడ్ చైర్మన్ గంగారెడ్డి

పెర్కిట్(ఆర్మూర్): ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్, అంకాపూర్ సొసైటీ చైర్మన్ మార గంగారెడ్డి కోరారు. ఆర్మూర్ మండలం అంకాపూర్ సొసైటీ పరిధిలో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంటకు గిట్టుబాటు ధర కల్పించేందుకు సొసైటీల పరిధిలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సొసైటీ వైస్ చైర్మన్ నవీన్‌రెడ్డి, ఉప సర్పంచ్ మచ్చర్ల కిషోర్ రెడ్డి, ఎంపీటీసీలు, సొసైటీ డైరెక్టర్లు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బాల్కొండ: ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామంలో మంగళవారం ధాన్యం కొనగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. సొసైటీ చైర్మన్ గంగాధర్, వైస్ ఎంపీపీ ఆకుల చిన్నరాజన్న, సర్పంచ్ ఆకుల రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

శాకాహార సద్భావన ర్యాలీ



వర్ని: మండల కేంద్రంలో మంగళవారం పిరమిడ్ సొసైటీ సభ్యుల ఆధ్వర్యంలో అహింసాయుత శాకాహార సద్భావన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా శాఖాహారం తినడం వల్ల కలిగే ప్రయోజనాలు, మాంసాహారం వల్ల దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.

ఆధ్యాత్మికం..

ఆధ్యాత్మిక చింతనతోనే ప్రశాంతత



బోధన్: ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత ప్రాప్తిస్తోందని, ప్రతి ఒక్కరూ భక్తి మార్గంలో నడవాలని మహారాష్ట్ర ప్రాంత ముఖేడ్ వీరశైవ మఠాధిపతి విరూపాక్ష శివాచార్య మహారాజ్ ప్రబోధించారు. పట్టణంలోని ఏకచక్రేశ్వరాలయంలో ఏర్పాటు చేసిన 18వ అఖండ శివనామ సప్తాహం మంగళవారం ఐదో రోజు కొనసాగింది. శిబిరంలో పరమ రహస్య గ్రంథ పారాయణం, భజనలు, మంగళహారతి, అన్నదానం కార్యక్రమాలను నిర్వహించారు.

వైభవంగా మహా చండీ యాగం



బోధన్: పట్టణంలోని విజయసాయి హైస్కూల్ ప్రాంగణంలో మంగళవారం మహా చండీయాగం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ దంపతులు, మేనేజర్ చక్రవర్తి దంపతులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



పెర్కిట్(ఆర్మూర్): మామిడిపల్లి లిల్లిపుట్ పాఠశాలలో మంగళవారం గ్రాడ్యుయేషన్ డేని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ ప్రాథమిక విద్యను పూర్తి చేసుకుని ప్రాథమిక విద్యలోకి ప్రవేశిస్తున్న విద్యార్థులకు కరస్పాండెంట్ రామకృష్ణ ప్రశంస పత్రాలను అందజేశారు.

నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపిక

వేల్పూర్: మండలంలోని పడగల్ హైస్కూలులో ఎనిమిదో తరగతి విద్యార్థులు సుశాంత్, అలోక నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు హెచ్‌ఎం విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వారిని అభినందించారు.

దర్గాను దర్శించుకున్న రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్



వర్ని: రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీత లక్ష్మారెడ్డి మంగళవారం మండలంలోని బడాపహాడ్ పుణ్యక్షేత్రాన్ని దర్శించుకున్నారు. దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండల మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు గోపాల్, తహసీల్దార్ విఠల్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యులకు సన్మానం

మాక్లూర్: గుత్పలో కంటి వెలుగు ముగింపు కార్యక్రమాన్ని పురస్కరించుకొని మంగళవారం సర్పంచ్ గంట చిన్నయ్య వైద్య సిబ్బందిని సన్మానించారు. కార్యదర్శి రాజా తరున్నుమ్, తదితరులు పాల్గొన్నారు.



ఆలయ నిర్మాణానికి విరాళం

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలో నిర్మిస్తున్న అయ్యప్ప ఆలయం నిర్మాణం కోసం గాంధీనగర్‌కు చెందిన కుంచెపు నగేష్ అనే వ్యక్తి రూ. 25వేలు విరాళం అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను సన్మానించారు.

